
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
సిద్దిపేట
5
మంగళవారం 4 నవంబరు 2025

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

- పగలు రెక్కీ..రాత్రి సమయాల్లో సెల్‌టవర్ బ్యాటరీలు, డీజిల్ చోరీ..
- 11 మంది నిందితుల అరెస్టు, రిమాండ్
- రూ.3 లక్షల నగదు, 18 బ్యాటరీలు రికవరీ

6

రంగంపేట పీఠాధిపతి
శ్రీ మాధవానంద స్వామితో జగ్గారెడ్డి

సంగారెడ్డి రాంనగర్ రామ్‌మందిర్‌లో ఆశ్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై సమీక్ష, సూచనలు

త్వరితగతిన ఆశ్రమానికి సంబంధించిన పనులు పూర్తిచేయాలని ఆదేశం

సంగారెడ్డిటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రంగంపేట పీఠాధిపతి శ్రీ మాధవానందస్వామితో కలిసి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి రామ్‌నగర్ రామ్‌మందిర్‌ను సందర్శించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న ఆశ్రమంలో చేయాల్సిన ఏర్పాట్ల గురించి సమీక్షించి అవసరమైన సూచనలు చేశారు. ఆశ్రమంలో అన్ని రకాల వసతులు సమకూర్చేలా అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో సత్తన్న, నారాయణ, తోపాజీ అనంత కిషన్, పవన్ పంతులు, కూన సంతోష్, కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రామ్‌నగర్ రామ్‌మందిర్‌లో శ్రీ మాధవానంద స్వామితో చర్చిస్తున్న జగ్గారెడ్డి



ముత్తంగి జాతీయ రహదారిపై ఓవర్ లోడ్‌తో వెళ్తూ ప్రమాదానికి గురైన టిప్పర్ (ఫైల్)

మృత్యుశకటాలు

- ఓవర్‌లోడ్, అతివేగంతో టిప్పర్ల దూకుడు
- అధికారుల కంటపడకుండా గమ్యస్థానాలకు చేరడమే లక్ష్యం
- డ్రైవర్ల అజాగ్రత్తతో రోడ్డు ప్రమాదాలు
- రవాణాశాఖ అధికారుల అలసత్వం

7



మల్లన్న సన్నిధిలో
భక్తులు క్షేమమేనా?

- తొక్కిసలాట ఘటనల నేపథ్యంలో భద్రతకు పటిష్ఠ చర్యలు అవసరం

కొమురవెల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాసం సందర్భంగా ఆలయాల్లో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగిన నేపథ్యంలో, ఇటీవల పలు ఆలయాల్లో తొక్కిసలాట ఘటనలు చోటు చేసుకుంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానంలో ప్రస్తుత కార్తీకమాస దర్శనాలు, పూజలు, త్వరలో ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల దృష్ట్యా లక్షలాదిగా తరలివచ్చే భక్తుల భద్రతకు పటిష్ఠ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. భక్తులు దర్శనానికి వెళ్లే క్యూలైన్ల రెయిలింగ్, ఇతర వస్తువులు కూడా పటిష్ఠంగా ఉన్నాయో లేదో పరిశీలించడం భద్రత విషయంలో చాలా అవసరం. భక్తుల భద్రతకు సంబంధించి ఆలయాధికారులు, పోలీసులు సమీక్ష నిర్వహిస్తే పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని భక్తులు సూచిస్తున్నారు.

పోలీసులతో సమన్వయం

మల్లన్న దర్శనానికి వచ్చే భక్తుల భద్రత విషయంలో నిత్యం అప్రమత్తంగా ఉంటున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి టంకశాల తెలిపారు. క్యూలైన్లలో భక్తుల దగ్గరికి వెళ్లి వారి అభిప్రాయాలను తీసుకుంటున్నామన్నారు. భక్తుల భద్రతకు, దర్శనానికి సంబంధించిన విషయాల్లో స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నట్లు చెప్పారు.

క్యూలైన్లను పరిశీలించిన ఏసీపీ సదానందం


మల్లన్న ఆలయంలోని క్యూలైన్లను, గంగిరేణి చెట్టు ప్రాంతాన్ని, భక్తులు బయటకి వచ్చే మెట్ల మార్గంతో పాటు, ప్రసాదాల విక్రయశాల, ఆలయ పరిసరాల్లో భక్తులు రద్దీగా ఉండే ప్రదేశాలను సోమవారం హుస్నాబాద్ ఏసీపీ సదానందం పరిశీలించారు. ఆయన ఆలయాధికారులను, అర్చకులను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆలయ ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్, సీఐ శ్రీనివాస్, స్థానిక ఎస్సై రాజుగౌడ్ ఉన్నారు.

నాడీ పట్టని వైద్యం

ప్రైవేటు వైద్యసేవల్లో పెరిగిన కమీషన్ల దందా.. అద్దె వైద్యులతో ప్రజల బతుకులు ఛిద్రమవుతున్నాయి. ఆర్థిక ఇబ్బందులతో అన్ని వ్యవస్థలు సతమతమవుతుంటే, వైద్య వ్యవస్థ మాత్రం రోజురోజుకూ బలోపేతమవుతోంది. హైదరాబాద్ నుంచి వైద్యులను కిరాయికి తెచ్చి ఇక్కడ చికిత్స అందిస్తున్నారు. అయితే, వారు వచ్చే వరకు శిక్షణ లేని నర్సులు, కింది స్థాయి సిబ్బంది వచ్చీరాని వైద్యం అందిస్తుండడంతో రోగుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి! గజ్వేల్‌లో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన కొన్ని మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులు, న్యూరో హాస్పిటళ్లు, పాలీక్లీనిక్‌లు, నర్సింగ్‌హోంలు ఇందుకు అడ్డాలుగా మారుతున్నాయి.

- గజ్వేల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి)

- పేరుకే డాక్టర్.. హైదరాబాద్ నుంచి వస్తేనే వైద్యం
- పదుల సంఖ్యలో స్పెషాలిటీ ఆసుపత్రులు.. నర్సింగ్‌హోంలు
- ఎంబీబీఎస్ చదవని వారు.. ఆర్ఎంపీ, పీఎంపీల నిర్వహణ
- గజ్వేల్ పట్టణంలో ప్రైవేటు ఆసుపత్రుల దందా!
- రోగుల ప్రాణాలకు రూ.లక్షల్లో ఖరీదు... అడిగే వారే కరువు!



గజ్వేల్‌లో కొందరు నిర్వహిస్తున్న ఆస్పత్రులకు హైదరాబాద్ నుంచి వైద్యులు కిరాయి పద్ధతిలో వచ్చిపోతున్నారు. వీరి సేవలు కేవలం ఆసుపత్రి లేటర్‌హెడ్‌లకు మాత్రమే పరిమితమవుతున్నాయి. దీంతో ఈ క్లీనిక్‌లలో ఆర్ఎంపీలు (రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్), పీఎంపీలు (ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్), స్థానిక ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులే దిక్కవుతున్నారు. ఈ ఆసుపత్రుల యాజమాన్యాలు ఏజెంట్లను నియమించుకుని, గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్ఎంపీలకు కమీషన్ల వల వేసి రోగులను ఆసుపత్రులకు రప్పించుకుంటున్నాయి. ఇదే అదునుగా ఆర్ఎంపీ వైద్యులు సైతం రెచ్చిపోతున్నారు. బిల్లులో యాభై శాతం కమీషన్ ఇస్తేనే రోగిని సిఫారసు చేస్తామని ఆసుపత్రి యజమానులకు అల్టిమేటం జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. కమీషన్లకు చిక్కిన అమాయక రోగులు రూ.లక్షల్లో బిల్లులు చెల్లించుకుని అప్పుల పాలవుతున్నారు.

ఒక్కో ప్రాణానికి ఒక్కో రేటు

గజ్వేల్‌లో ప్రైవేట్ ఆసుపత్రుల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నా, వాటిని అరికట్టాల్సిన అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో తూగుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల గజ్వేల్ కేంద్రంగా ఏర్పడిన పలు ప్రైవేటు ఆసుపత్రులకు హైదరాబాద్ నుంచి కిరాయి డాక్టర్లు వస్తూ జేబులు నింపుకుని వెళ్లిపోతున్నారు.

మిగతా 8వ పేజీలో



సదర్ సంబురం

సిద్దిపేటలోని 17వ వార్డు వివేకానంద కాలనీ యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సదర్ సయ్యాట సందడిగా జరిగింది. ఈ సందర్భంగా హరియాణా నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన దున్నలు కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. యాదవ సంఘం నాయకులు, కుల సంఘ సభ్యులు, పట్టణ కౌన్సిలర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో గొల్ల సుద్దుల ఆటలు, మహిళల నాట్య ప్రదర్శనలు, సదర్ సయ్యాటలో భాగంగా జరిగిన ఆటపాటలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి

- సిద్దిపేట కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి)





లద్నూరులో దెబ్బతిన్న పొలాన్ని పరిశీలిస్తున్న నిర్మల్ ఎమ్మెల్యే

సల్మాన్‌ఖాన్‌తో ఫొటోలు దిగడం కాదు
రైతుల కష్టాలు తెలుసుకోవాలి

- పంటలకు ఎకరాకు రూ.30వేలు చెల్లించాలి
- నిర్మల్ శాసనసభ్యుడు, బీజేపీ శాసన సభ పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి

మద్దూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పెళ్లిళ్లు, పేరంటాలతో సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ, ముంబై పర్యటనలు చేస్తూ సినీ హీరో సల్మాన్‌ఖాన్‌తో ఫొటోలు దిగడం సరికాదని, మొంథా తుఫాన్‌తో పంట నష్టపోయి అల్లాడుతున్న రైతుల కష్టాలు తెలుసుకోవాలని నిర్మల్ శాసన సభ్యుడు, బీజేపీ శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మద్దూరు మండలం లద్నూరులో పంట నష్టపోయిన రాగుల చంద్రమ్మ వరిపొలాన్ని స్థానిక నేతలతో కలిసి పరిశీలించి మాట్లాడారు. తుఫాన్ బాధితులకు ప్రభుత్వం ఆసరాగా ఉంటుందని నష్టపరిహారం ఇస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. పెట్టుబడులు నష్టపోయి అప్పుల్లో కూరుకుపోయారన్నారు. ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులున్నాయన్నారు. ఎకరాకు రూ.10వేల నష్టపరిహారం ప్రకటించినా రైతుల ఖాతాల్లో జమకాలేదన్నారు. కేవలం పేపరు ప్రకటనలకే పరిమితమయ్యారని దుయ్యబట్టారు. నష్టపోయిన రైతులకు తక్షణమే ఎకరాకు రూ.30 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా అధ్యక్షులు లక్ష్మీనారాయణతో పాటు బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంగోని సురేష్‌గౌడ్, జనగామ జిల్లా అధ్యక్షుడు చౌడ రమేష్ పాల్గొన్నారు.

అకాల వర్షానికి అగచాట్లు

- కొట్టుకుపోయిన ధాన్యం
- తడిసిన ధాన్యం తక్షణమే కొనుగోలు చేయాలి
- దుబ్బాక, నంగునూరులో రాస్తారోకో, ధర్నాలు

దుబ్బాక/మిరుదొడ్డి/నంగునూరు/సిద్దిపేటకల్చరల్/సిద్దిపేట, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మరోసారి భారీ వర్షం కురిసింది. ఆదివారం రాత్రి దంచికొట్టిన వానకు రైతుల ఆరుగాలం శ్రమ వరదలో కొట్టుకుపోయింది. తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి తమను ఆదుకోవాలంటూ సోమవారం ఉదయం రైతులు ఆందోళనకు దిగారు. మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో వరిపంట నేలకొరిగింది. అక్బర్‌పేట-భూంపల్లి మండలం నగరం గ్రామానికి చెందిన రైతు జడిపల్లి కిషన్ మూడు ఎకరాల్లోని వరి పూర్తిగా దెబ్బతినడంతో కన్నీరుమున్నీరయ్యారు.

దుబ్బాకలో రహదారిపై బైఠాయింపు

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ దుబ్బాకలో రైతులు ఆందోళన చేపట్టారు. మొదట మార్కెట్ యార్డు ముందు ధర్నా చేసినా అధికారులు స్పందించకపోవడంతో, శివాజీ విగ్రహం వద్ద రహదారిపై రాస్తారోకోకు దిగారు. వారికి బీఆర్ఎస్ నాయకులు గుండెళ్లి ఎల్లారెడ్డి, బీజేపీ నాయకులు రమేష్‌రెడ్డితోపాటు పలువురు నాయకులు మద్దతు తెలిపారు. సుమారు గంటన్నర పాటు ఆందోళన చేపట్టారు. దుబ్బాక తహసీల్దార్ సంజయ్‌కుమార్ అక్కడికి చేరుకుని హామీ ఇచ్చినా రైతులు వినలేదు. దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్ఐ కీర్తిరాజులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. అప్పటికే ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

మార్కెట్ యార్డులో కారుచీకట్లు

ఆదివారం కురిసిన భారీ వర్షానికి మార్కెట్ యార్డులో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కారుచీకట్లలో రైతులు ధాన్యాన్ని కాపాడుకోలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నంగునూరులో పురుగుల మందు డబ్బాలతో

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ నంగునూరు వివేకానంద చౌరస్తాలో రైతులు రాస్తారోకో, ధర్నా చేపట్టారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయకపోతే తమకు చావే శరణ్యమంటూ అంటూ పురుగుల మందు డబ్బాలతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. రైతులకు మద్దతుగా అఖిలపక్ష నాయకులు ధర్నాలో పాల్గొన్నారు. ట్రాఫిక్ నిలిచిపోవడంతో రాజగోపాల్‌పేట ఎస్ఐ టి.వివేక్ చేరుకుని రైతులకు నచ్చజెప్పారు. సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను నంగునూరుకు చేరుకుని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ఆఫీసర్ (డీసీవో) వరలక్ష్మి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి త్వరితగతిన ధాన్యాన్ని కొనుగోలు చేసి షిఫ్ట్ చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రంలో కనీస సౌకర్యాలు లేవని, వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతుందని అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు, రైతులు, అఖిలపక్ష నాయకులు డీసీవోకు, తహసీల్దార్ మాధవికి ఫిర్యాదు చేశారు. వ్యవసాయ అధికారి గీత ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



దుబ్బాక మార్కెట్ యార్డులో వరద నీటిలో కొట్టుకుపోతున్న ధాన్యం

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి: కలెక్టర్

వర్షాల కారణంగా దెబ్బతిన్న ప్రభుత్వ నిర్మాణాలకు సంబంధించి శాశ్వత నిర్మాణానికి ప్రతిపాదనలు కలెక్టర్ హైమావతి పలుశాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీకి చెందిన లోలెవెల్ వంతెనలు, కల్వర్టులు, రోడ్లు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మున్సిపాలిటీల్లోని వివిధ నిర్మాణాల మరమ్మత్తుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లలో ఎక్కడా ఇబ్బందులు రావొద్దని కలెక్టర్ హైమావతి అన్నారు. జిల్లాలోని మిల్లర్లతో ధాన్యం కొనుగోలుపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ప్రత్యేక పరిస్థితుల్లో హుస్నాబాద్ నుంచి జిల్లాలోని అన్ని రైస్ మిల్లులకు తడిచిన ధాన్యాన్ని పంపించినట్లు చెప్పారు. ఇందుకు సహకరించిన మిల్లర్లకు ధన్యవాదాలు తెలిపారు. హమాలీల సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.



నంగునూరులో స్వామి వివేకానంద విగ్రహం వద్ద రైతుల రాస్తారోకో

కళాశాలల
సమ్మెబాట

సిద్దిపేటకల్చరల్/ గజ్వేల్‌రూరల్ నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) జిల్లాలోని ఉన్నత విద్యాసంస్థలు సమ్మెబాట పట్టాయి. రాష్ట్రవ్యాప్త బంద్‌లో బాగంగా సోమవారం జిల్లాలోని డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ సహా అన్ని వృత్తి విద్యా కళాశాలలు సమ్మెలో పాల్గొన్నాయి. జిల్లాలో గతేడాది నాలుగు డిగ్రీ కాలేజీలు ఉన్నప్పటికీ ఫీజు బకాయిల కారణంగా నిర్వహణ చేయలేక రెండు కళాశాలలు మూతపడ్డాయి. ప్రస్తుతం జిల్లాలో రెండు ప్రైవేట్ డిగ్రీ కళాశాలు ఉన్నాయి. ఒక్కో డిగ్రీ కళాశాలకు రూ.4 కోట్ల నుంచి రూ.5కోట్ల వరకు బకాయిలు రావాల్సి ఉంది. ఆ డబ్బులు వస్తాయనే ఉద్దేశంతో రూ.3 కోట్ల వరకు అప్పులు చేసి కళాశాలను నడుపుతున్నామని ఓ కళాశాల యాజమాని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక జిల్లాలో ఒక ఇంజనీరింగ్, 2 ఫార్మసీ, 6 బీఈడీ, ఒక పాలిటెక్నిక్ కళాశాల ఉంది. అన్ని కలుపుకుని జిల్లావ్యాప్తంగా రూ.40 కోట్ల పైనే బకాయిలు రావాలని యజామాన్యాలు చెబుతున్నాయి. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న నిరవధిక బంద్‌లో భాగంగా గజ్వేల్‌లోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు సోమవారం స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. రేపటి నుంచే రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెను ఉధృతం చేస్తామని ప్రభుత్వ నిర్బంధాలు, విజిలెన్స్ దాడులతో భయపెట్టలేరు ఉమ్మడి మెదక్ జిల్లా ప్రైవేట్ కళాశాలల జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నరాములు అన్నారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

- పగలు రెక్కీ..రాత్రి సమయాల్లో సెల్‌టవర్ బ్యాటరీలు, డీజిల్ దొంగతనాలు
- 11 మంది నిందితుల అరెస్టు, రిమాండ్
- రూ.3 లక్షల నగదు, 18 బ్యాటరీలు రికవరీ
- వివరాలు వెల్లడించిన సీపీ విజయ్‌కుమార్

సిద్దిపేట క్రైం, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): సెల్ టవర్ బ్యాటరీలు, డీజిలు దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా ముఠా సభ్యులు ఐదుగురిని, వాటిని కొనుగోలు చేసిన మరో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట పోలీసు కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ విజయ్‌కుమార్ వివరాలను వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చెంద్రుగుండ మండలం అయ్యన్నపాలెంకు చెందిన బత్తుల గురుస్వామి బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ ఖర్చులకు డబ్బులు సరిపోవడం లేదని గతంలో ఆటో బ్యాటరీల దొంగతనాలకు పాల్పడగా పోలీసులు కేసులు నమోదు చేశారు. అదే అనుభవంతో సులువుగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో సెల్ టవర్‌లో బ్యాటరీలు దొంగతనం చేస్తే ఎవరూ పట్టించుకోరని, బయట దూర ప్రాంతాల్లో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. గురుస్వామి, అదే గ్రామానికి చెందిన లారీ డ్రైవర్లు బత్తుల సాయిరాం, అలకుంట శంకర్, ట్రాక్టర్ డ్రైవర్ అలకుంట లక్ష్మణ్, సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గురువన్నపేటలో ఇటుకబట్టీల వ్యాపారం చేసే బత్తుల శ్రీనులతో కలిసి పగటి పూట రెక్కీ నిర్వహించి రాత్రి సమయాల్లో సెల్ టవర్‌ల బ్యాటరీలు, డీజిల్ దొంగతనం చేసేవారు. దొంగిలించిన బ్యాటరీలను ఆటోలో పోసాన్‌పల్లికి చెందిన స్క్రాప్ వ్యాపారం చేసే పుట్ట ఆంజనేయులుకు విక్రయించి వచ్చిన డబ్బులు పంచుకునే వారు. గత రెండేళ్లుగా సిద్దిపేట జిల్లాలోని పలు గ్రామ శివార్లలోని 16 సెల్ టవర్లలోని బ్యాటరీలు, డీజిల్ దొంగతనాలకు పాల్పడ్డారు. అదేవిధంగా రాచకొండ, జగిత్యాల, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, వరంగల్, జనగాం, మహబుబాబాద్ జిల్లాల పరిధిలో 33 వరుస దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. దొంగిలించిన బ్యాటరీలు పుట్ట ఆంజనేయులుకు విక్రయించగా అతడు నాగపూరికి చెందిన నూనె మహేందర్ నాలుగు, జోగు మహేష్‌కు నాలుగు, ఎండీ హజీమ్‌కు మూడు, శిలసాగరం రామచంద్రంకు మూడు బ్యాటరీలు విక్రయించారు. దొంగిలించిన డీజిల్‌ను గురువన్నపేటకు చెందిన బండారు శ్రీనివాస్‌కు విక్రయిస్తూ వచ్చిన డబ్బును అందరూ పంచుకునేవారు. జిల్లాలోని తొగుట, బేగంపేట, రాయపోల్ పోలీసుస్టేషన్‌లల్లో గతంలో నమోదైన కేసుల్లో సీపీ పర్యవేక్షణలో గజ్వేల్ ఏసీపీ నర్సింహులు, తొగుట సీఐ లతీఫ్, సీఐ అంజయ్య, ఎస్ఐలు రవికాంతరావు, మానస, అరుణ్‌కుమార్ ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు.

స్విమ్మింగ్‌పూల్‌లో మునిగి ఇద్దరు చిన్నారుల మృతి

- అమీన్‌పూర్ అర్బన్‌రైజ్ అపార్ట్‌మెంట్ క్లబ్‌హౌజ్‌లో దారుణం


అపార్ట్‌మెంట్‌లో చిన్నారులు మృతి చెందిన స్విమ్మింగ్‌పూల్

అమీన్‌పూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ క్లబ్‌హౌజ్‌లోని స్విమ్మింగ్‌పూల్ ఇద్దరు చిన్నారుల పాలిట మృత్యుకుహరంగా మారింది. సరదాగా ఈతకు వెళ్లిన ఇద్దరు చిన్నారులు నీట మునిగి ఊపిరాడక అపస్మారకస్థితిలో ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పట్టణం హెచ్ఎంటీ స్వర్ణపురికాలనీలోని అర్బన్ రైజ్ స్ప్రింగ్ అపార్ట్‌మెంట్‌లో చోటుచేసుకున్నది. అపార్ట్‌మెంట్ 925ప్లాట్‌లో నివాసం ఉండే షణ్ముకకుమార్, ప్రతిమ దంపతుల కుమార్తె ప్రజ్ఞ(9), ఫ్లాట్ నంబర్ 906లో నివాసం ఉండే విజయ్ రెడ్డి, లోకేశ్వరీ కుమార్తె అద్వికరెడ్డి(8) ఆదివారం సాయంత్రం క్లబ్ హౌజ్ స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొట్టేందుకు దిగారు. ముందు తక్కువ లోతు ఉన్న కిడ్స్‌పూల్‌లో ఈత కొట్టి కొద్దిసేపటికి పెద్దస్విమ్మింగ్‌పూల్‌లోకి దిగారు. లోతు ఎక్కువగా ఉండటంతో ఈత రాక నీట మునిగిపోయారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న చిన్నారులను అక్కడే ఉన్న కొందరు గుర్తించి బయటకు తీశారు. అపస్మారకస్థితిలో ఉన్న ప్రజ్ఞను మియాపూర్ లోటస్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందింది. అద్వికను కొండాపూర్ హోలిస్టిక్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. తెల్లవారు జామున రెండుగంటలకు అద్విక మృతిచెందింది. సాఫ్టవేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్న షణ్ముకకుమార్‌ది వైజాగ్ కాగా, విజయ్‌రెడ్డిది ఎన్‌టీఆర్ కృష్ణ జిల్లా ఇబ్రహింపట్నం. మృతిచెందిన ప్రజ్ఞ అమీన్‌పూర్ సూర్యగ్లోబల్ స్కూల్‌లో 4వ తరగతి చదువుతుండగా, అద్వికరెడ్డి చందానగర్ జెనెసిస్ స్కూల్‌లో 3వ తరగతి చదువుతోంది. ఈ మేరకు అమీన్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారుల మృతదేహాలకు పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రిలో పోస్టు మార్టం నిర్వహించారు.


ప్రజ్ఞ (ఫైల్)


అద్విక (ఫైల్)

నిర్లక్ష్యమే కారణం

గేటెడ్ కమ్యూనిటీ క్లబ్‌హౌజ్‌లోని అపార్ట్‌మెంట్ నిర్వహణ బాధ్యత అర్బన్‌రైజ్ బిల్డర్ యాజమాన్యంపైనే ఉండగా ప్రమాదం పొంచి ఉండే ఈతకొలను వద్ద కేర్‌టేకర్లను నియమించకపోవడం వల్లే చిన్నారులు మృతిచెందారని అపార్ట్‌మెంట్‌వాసులు ఆగ్రహం వ్యక్తంచేశారు. బాధిత తల్లిదండ్రులు సైతం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిన్నారులను కనిపెట్టుకుని ఉండాల్సిన వారు ఎవరూ లేకపోవడం, అక్కడ ఉన్న తల్లిదండ్రులు సైతం ఇంత దారుణం జరుగుతుందని ఊహించకపోవడం తదితర కారణాల వల్ల చిన్నారుల ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయి తీవ్ర విషాదం నింపింది. కొంతసేపు మినీ స్విమ్మింగ్‌పూల్‌లోనే ఈత కొట్టిన చిన్నారులు అకస్మాత్తుగా పెద్ద స్విమ్మింగ్‌పూల్‌లోకి దూకడం వల్లే ఈ దారుణం చోటుచేసుకుందని భావిస్తున్నారు. అక్కడే ఉన్న సీసీటీవీలను సైతం పోలీసులు స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. స్విమ్మింగ్‌పూల్ నిర్వహణ గాలికి వదిలేసి చిన్నారుల మృతికి కారణమైన అర్బన్ రైజ్ యాజమాన్యంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నరేష్ పేర్కొన్నారు.


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రేమ వివాహం నచ్చక.. యువకుడి ఇంటికి ఇంటికి నిప్పు

ఝరాసంగం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తమ ఇంటి ఆడబిడ్డను ప్రేమ వివాహం చేసుకోవడం నచ్చని ఆమె కుటుంబసభ్యులు అత్తింటికి నిప్పు పెట్టారు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల పరిధి కక్కర్‌వాడ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బోయిని రాధాకృష్ణ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన విఠల్ కుమార్తె మౌనికను పది రోజుల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి వారు హైదరాబాద్‌లో ఉంటున్నారు. అయితే, తమ ఇంటి ఆడబిడ్డను ప్రేమ వివాహం చేసుకుని.. రాధాకృష్ణ కుటుంబసభ్యులు కళ్ల ముందే తిరుగుతుండటం మౌనిక కుటుంబసభ్యులకు నచ్చలేదు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని సోమవారం ఉదయం రాధాకృష్ణ తండ్రి బోయిని రాములు పనులు చేసుకుంటుండగా, మౌనిక కుటుంబ సభ్యులు వచ్చి దాడి చేశారు. అలాగే, ఇంటికి నిప్పు పెట్టారు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు అగ్నిమాపక సిబ్బందికి విషయం చెప్పడంతో వారు వచ్చి మంటలను ఆర్పారు. రాధాకృష్ణ సోదరుడు బోయిన నాగేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

హవేళిఘణపూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బైక్ ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల శివారు చోటు సోమవారం చేటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. చేగుంటకు చెందిన తిరుపతి కృష్ణ(37) మెదక్‌లోని హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. ఇంటి నుంచి మెడికల్ షాపుకు నడుచుకుంటూ వెళ్లి, తిరిగి వస్తున్న క్రమంలో మెదక్ బీఆర్ఎస్ పార్టీ జిల్లా ఆఫీసు సమీపంలో వెనుక వైపు నుంచి వచ్చిన బైక్ బలంగా ఢీ కొట్టింది. దీంతో కృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం

- మృతదేహంపై నుంచి ఇతర వాహనాలు

మాసాయిపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. మృతదేహం రోడ్డుపై పడి ఉండగా, వెనుక నుంచి వచ్చిన వాహనాలు పై నుంచి వెళ్లడంతో సదరు వ్యక్తి నుజ్జునుజ్జు అయ్యాడు. మెదక్ జిల్లా మాసాయిపేట వద్ద 44 జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన ఈ రోడ్డు ప్రమాద వివరాలు చేగుంట ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని 44 జాతీయ రహదారిపై మసాయిపేట గోశాల వద్ద సుమారు 45 ఏళ్ల వ్యక్తి రోడ్డు దాటుతుండగా, వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన రాత్రి వేళ చోటు చేసుకోవడంతో మృతదేహం రోడ్డుపైనే పడి ఉండగా, వెనుక నుంచి వచ్చిన కొన్ని వాహనాలు పై నుంచి వెళ్లాయి. దీంతో మృతదేహం గుర్తుపట్టలేనంతగా నుజ్జునుజ్జు అయింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కొండాపూర్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వ్యక్తి సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో మృతిచెందిన సంఘటన సోమవారం చోటుచేసుకున్నది. కొండాపూర్ ఎస్ఐ సోమేశ్వరీ వివరాల ప్రకారం... కొండాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 35-40 ఏళ్ల వయసు కలిగిన ఒకరు మునిదేవునిపల్లి శివారులో రోడ్డు పక్కన మూడు రోజుల నుంచి తిండి లేకుండా కదలలేని స్థితిలో పడిపోయి ఉన్నాడు. స్థానికుల సమాచారంతో ఆదివారం సాయత్రం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి వివరాల తెలిసిన వారు ఫోన్ నంబర్లను 8712656748, 8712656722 సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అక్కన్నపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పెట్రోలింగ్ పోలీసులు సోమవారం పట్టుకొని అక్కన్నపేట పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. మండలంలోని గౌరవెల్లిలో కొన్ని నెలలుగా మట్టిని ఫిల్టర్ ఇసుకగా మారుస్తూ నాసిరకం ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారని అక్టోబరు 4న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన పోలీసులు నిఘా పెట్టి సోమవారం బోడిగపల్లి స్టేజి వద్ద రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు.

అటవీ భూమి ఆక్రమణ.. వ్యక్తిపై కేసు నమోదు

శివ్వంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అటవీ భూమి ఆక్రమించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి, అందులోని ఇసుక డంప్‌ను సీజ్ చేసిన ఘటన పాంబండ గ్రామంలో మంగళవారం చోటుచేసుకున్నది. అటవీ శాఖ సెక్షన్ అధికారి భూపతి తెలిపిన వివరాల మేరకు.. తూప్రాన్ రేంజ్ మంగల్‌పర్తి పరిధిలోని పాంబండ అటవీ స్థలంలో ఇసుక డంపును ఏర్పాటు చేసుకుని రాత్రి వేళ టిప్పర్‌లో తరలిస్తున్నారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ఇటీవల పోలీసులు డంపును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అయినా రవాణాను ఆపలేదు. సోమవారం పోలీసులు దాడి చేయగా, భారీగా డంప్ చేసిన ఇసుకను సీజ్ చేశారు. సదరు డంపింగ్ అటవీ భూమిని చదును చేసిన కొత్త రాములుపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఎస్ఓ భూపతి తెలిపారు.

ముప్పిరెడ్డిపల్లిలో కల్లు దుకాణంపై కేసు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మనోహరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ముప్పిరెడ్డిపల్లిలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న కల్లు దుకాణంపై పోలీసులు దాడి చేసి కేసు నమోదు చేసిన ఘటన సోమవారం చోటుచేసుకున్నది. పుట్టగొడుగుల్లా కల్లు దుకాణాలు వెలిశాయని 'ఆంధ్రజ్యోతి'లో కల్తీ గమ్మత్తు శీర్షికతో సోమవారం కథనం పచురితమైంది. స్పందించిన నర్సాపూర్ ఎస్‌హెచ్‌వో ఎక్సైజ్ అధికారులు మనోహరాబాద్ మండలంలోని కల్లు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ముప్పిరెడ్డిపల్లితో పాటు మండలంలోని కాళ్లకల్, కూచారంలోనూ కల్లు దుకాణాలను తనిఖీలు చేశారు.

రాజీ చేయదగిన కేసులను పరిష్కరించండి

● సంగారెడ్డి ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర

సంగారెడ్డి క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 15వ తేదీన జరిగే ప్రత్యేక లోక్ అదాలత్‌లో అవకాశం ఉన్న ప్రతీ కేసును రాజీ కుదుర్చాలని సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీచంద్ర సూచించారు. జిల్లా కోర్టులో సోమవారం న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. భార్యాభర్తల వివాదాలు, ఎక్సైజ్ కేసులు, బ్యాంకు కేసులతో పాటు రాజీ చేయదగ్గ కేసులలో ఇరువర్గాలు లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకోవచ్చని అన్నారు. క్షణికావేశంలో ఇరువర్గాలు చిన్న తగాదాలు పడి కేసులు నమోదు జరిగి కోర్టు చుట్టూ తిరుగుతూ తమ విలువైన సమాయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. కోర్టులో తమపై ఉన్న కేసులను రాజీ చేసుకొని సామరస్యంగా స్నేహభావంతో కలిసిమెలిసి ఉండాలన్నారు. ఈనెల 15న జరిగే ప్రత్యేక లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య, న్యాయాధికారులు ఆర్.అనిత, కె.ధనలక్ష్మి, దుర్గారాణి తదితరులు పాల్గొన్నారు.

పర్కపెల్లి యాదగిరి కథకు బహుమతి



పర్కపెల్లి యాదగిరి

సిద్దిపేట కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లాలో మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ నిర్వహించిన కథల పోటీలో సిద్దిపేట కథకుడు పర్కపెల్లి యాదగిరి రచించిన చావు కథకు బహుమతి లభించిందని వెన్నెల సాహితీ సంఘం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. నవంబరు 22, 23న విజయవాడలో నిర్వహించనున్న జాతీయ సాంస్కృతిక ఉత్సవాలలో పర్కపెల్లి యాదగిరిని నగదు బహుమతితో సత్కరిస్తారని పేర్కొన్నది. ఈ సందర్భంగా వెన్నెల సాహితీ సంఘం సభ్యులు వంగర నరసింహారెడ్డి, కొండి మల్లారెడ్డి, మహమూద్ పాషా, అశోకరాజు తదితరులు యాదగిరిని అభినందించారు.

కేతకీలో కేంద్ర మాజీ మంత్రి భగవత్ పూజలు



సంగమేశ్వర ఆలయంలో మాజీ మంత్రి

ఝరాసంగం, నవంబరు3 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధిగాంచిన కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం కేంద్ర మాజీ మంత్రి భగవత్ కుబా కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారితో స్వామి వారికి అభిషేక కార్యక్రమాలను చేయించారు. ఆలయ ఈవో శివరుద్రప్ప వారిని శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అదే విధంగా వరంగల్ జిల్లా అదనపు ఎస్పీ నల్లమల్ల రవి కుటుంబసమేతంగా ఆలయంలో పూజలు చేశారు.

సమ్మిళిత వృద్ధికి అవకాశాలు అందించడమే లక్ష్యం

సుజుకీ మోటార్ కార్పొరేషన్ గ్లోబల్ మార్కెటింగ్ కౌన్సిలర్ కింజి సైటో

కంది, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ హైదరాబాద్ భాగస్వామ్యంతో దేశ యువతను ఆచరణాత్మక నైపుణ్యాలతోపాటు సమ్మిళిత వృద్ధి వైపు నడిపించే అవకాశాలను అందించడమే తమ లక్ష్యమని సుజుకీ మోటార్ కార్పొరేషన్ గ్లోబల్ మార్కెటింగ్ కౌన్సిలర్ కింజి సైటో అన్నారు. ఐఐటీహెచ్‌లో ప్రారంభమైన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌పై సోమవారం ఆయన మాట్లాడుతూ ఇది సమగ్ర నైపుణ్యాభివృద్ధికి కేంద్రంగా పనిచేస్తుందని, యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే కమ్యూనికేషన్ సామర్థ్యాలను మెరుగుపరిచే కార్యక్రమాలను అందించనున్నదని వెల్లడించారు. ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్. మూర్తి మాట్లాడుతూ వినూత్న సాంకేతిక పరిజ్ఞానాల ద్వారా గ్రామీణాభివృద్ధికి దోహదం చేయాలనే ఉద్దేశంతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు.

అంగన్‌వాడీ కోసం స్థల సేకరణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మనోహరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తుపాకులపల్లిలో కొన్నేళ్లుగా చెట్ల కిందనే కొనసాగుతున్న అంగన్‌వాడీకి స్థలం సేకరణ కోసం సోమవారం మండల సూపర్‌వైజర్ మెహతా బేగం, గ్రామపెద్దలు ముందుకు వచ్చారు. మండలంలో 'అంగన్‌వాడీలు అధ్వానం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి స్పందించారు. గ్రామంలోని కొంత స్థలం అంగన్‌వాడీ భవనం కోసం ఇవ్వడానికి అంగీకరిస్తున్నామని గ్రామ పెద్దలు, గ్రామ కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో ఒప్పంద పత్రం రాశారు. ప్రభుత్వం తరఫున గ్రామంలో వెంటనే భవనం నిర్మించాలని మండల అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మేహతబేగంకు విన్నవించారు. కలెక్టర్‌కు, చేరవేసి భవనం నిర్మించే విధంగా చూస్తామని ఆమె గ్రామస్థులకు తెలిపారు.

రామవరం పీహెచ్‌సీలో రోగులకు ఇబ్బందులు



పీహెచ్‌సీలో ఖాళీగా వైద్యుడి కుర్చీ

అక్కన్నపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జ్వరం వచ్చిందని ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే.. అక్కడ వైద్యులు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడిన సంఘటన అక్కన్నపేట మండలం రామవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో సోమవారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. ఇక్కడి పీహెచ్‌సీ రెగ్యులర్ వైద్యుడు డాక్టర్ వినోద్‌రెడ్డి అక్టోబరు 30 నుంచి పది రోజులపాటు సెలవులో వెళ్లారు. హుస్నాబాద్ ఆయుష్ మెడికల్ ఆఫీసర్ తులసీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. సోమవారం పూజ ఉందని ఆమె కూడా సెలవు పెట్టింది. దీంతో ఆసుపత్రికి వచ్చిన రోగులు ఇబ్బందులు పడ్డారు. స్టాఫ్‌నర్సు మేరీ రోగులకు టాబ్లెట్లు ఇచ్చి పంపించారు. ఎవరైనా బాగా ఇబ్బంది ఉందని వస్తే సెల్‌ఫోన్‌లో వైద్యులను సంప్రదించి చికిత్స చేస్తానని స్టాఫ్‌నర్స్ మేరీ చెప్పడం గమనార్హం. ప్రతీ రోజు ఈ ఆసుపత్రికి 50 నుంచి 60 మంది రోగులు వస్తారని ఆమె తెలిపారు. వైద్యం కోసం వస్తే వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ హాస్పిటల్‌కి వెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రామవరం గ్రామానికి చెందిన పొన్న కరుణాకర్ తెలిపారు.

డీవోఏ, డీఎంఐటీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో డిప్లొమా ఇన్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ (డీవోఏ), డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ కోర్సు(డీఎంఐటీ)లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డా.ప్రకాశ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికిగాను రెండు సంవత్సరాల పారా మెడికల్ కోర్సులకు సంబంధించి ఈ నెల 27 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు కళాశాల వెబ్‌సైట్‌ను, కళాశాలను సంప్రదించాలని ఆయన కోరారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ గడువు పొడగింపు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ స్కూల్ అడ్మిషన్ గడువును ఈ నెల 7వ తేదీ వరకు పొడగించినట్టు డీఈవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో అడ్మిషన్లు పొందాలనుకునే వారు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. వివరాలకు 8008403635 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

రేపు ఉమ్మడి జిల్లా వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

సిద్దిపేట కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : 8వ తెలంగాణ సీనియర్ అంతర్ జిల్లా వాలీబాల్ చాంపియన్ షిప్ పోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లా సీనియర్ వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నారు. సిద్దిపేట వాలీబాల్ అకాడమీ క్రీడా మైదానంలో బుధవారం పురుషుల, మహిళ జట్లను ఎంపికలు చేపట్టనున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్ష కార్యదర్శుల సమక్షంలో ఎంపికలు నిర్వహించనున్నట్లు వాలీబాల్ అసోసియేషన్ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ ఒరిజినల్, ఒక జిరాక్స్ కాపీ తీసుకొని సిద్దిపేట స్టేడియంకు ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు.

మృత్యుశకటాలు

ప్రాణాలు తీస్తున్న టిప్పర్లు



ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్)పై గండిపేట వైపు వెళ్తున్న భిక్షపతి కారు పాటి సమీపంలో టిప్పర్‌ను ఢీకొట్టిన ఘటన జూన్ 9న చోటుచేసుకున్నది. ఈ ఘోర ప్రమాదంలో భిక్షపతి కుమార్తె వైష్ణవి అక్కడికక్కడే మృతిచెందగా, భిక్షపతి, మరొకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు.

సదాశివపేటకు చెందిన గిరి వనస్థలిపురం వెళ్లేందుకు కారులో వెళుతూ ఓఆర్‌ఆర్‌పైకి ఎక్కాడు. టిప్పర్‌ను ఢీకొనడంతో ప్రమాదానికి గురై మరణించగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన మార్చి 21న చోటుచేసుకున్నది.

2020లో మార్చిలోనూ లక్డారం గ్రామానికి చెందిన మాచన్నగారి వెంకటరామిరెడ్డి(25) అనే యువకుడు బైక్‌పై వెళ్తుండగా టిప్పర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదే గ్రామానికి చెందిన రామిరెడ్డి (30) కూడా గతంలో టిప్పర్ ఢీకొనడంతో ప్రాణాలు కోల్పోయాడు.

లక్డారం చౌరస్తా, 65వ నంబర్ జాతీయ రహదారి, ఔటర్‌పై జరిగిన టిప్పర్ ప్రమాదాల్లో అమాయక ప్రజలు అసువులు బాసిన సంఘటనలు అనేకం. తాజాగా చేవెళ్ల సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో దాదాపు 20 మంది మృతికి కారణమైన టిప్పర్ కూడా సంగారెడ్డి జిల్లా లక్డారం సమీప గ్రామం బ్యాతోల్ నుంచే వెళ్లిందన్న సంగతి స్థానికులను తీవ్ర కలవరపాటుకు గురిచేసింది.

ఓవర్‌లోడ్, అతివేగంతో నిర్లక్ష్యంగా టిప్పర్ల దూకుడు

అధికారుల కంటపడకుండా గమ్యస్థానాలకు చేరడమే లక్ష్యం

డ్రైవర్ల అజాగ్రత్తతో రోడ్డు ప్రమాదాలు

రవాణా శాఖ అధికారుల అలసత్వం

మామూళ్ల మత్తులో మైనింగ్ శాఖ

పటాన్‌చెరు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో నిర్మాణ రంగం భారీ స్థాయిలో కొనసాగుతున్న నేపథ్యంలో, లక్డారం ప్రాంతం నుంచి వందలాది వాహనాల్లో నిత్యం తరలివెళ్తున్న కంకర, డస్ట్ లోడుతో కూడిన టిప్పర్లు(డంప్ ట్రక్‌లు) రహదారులపై మృత్యుశకటాల్లా దూసుకుపోతున్నాయి. అతివేగం, అజాగ్రత్త, దారుణమైన ఓవర్‌లోడ్‌తో నడుస్తున్న ఈ టిప్పర్ల వల్ల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ఎన్నో కుటుంబాల్లో విషాదాన్ని మిగులుస్తున్నాయి. ఇంటి యజమానులు, యువకులు మృత్యువాత పడటంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడి, ఆర్థికంగా, మానసికంగా చితికిపోతున్నాయి.

మైనింగ్ మాఫియాకు కొమ్ముకాస్తూ

ఈ ప్రమాదాలకు ప్రధాన కారణం మైనింగ్ మాఫియా, వారిపై పర్యవేక్షణ లేకపోవడమేనని స్థానికులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. పటాన్‌చెరు రూరల్ పరిధిలోని లక్డారంలో భారీగా క్రషర్లను ఏర్పాటు చేసేందుకు మైనింగ్ మాఫియా ప్రజాభిప్రాయ సేకరణలను సైతం తప్పుదోవ పట్టించింది. తమకు అనుకూలంగా ఉన్న ఎన్జీవోలు, స్వచ్ఛంద సంస్థలను రంగంలోకి దింపి క్రషర్లను ఏర్పాటు చేసుకున్నారు. గతంలో కేసులు నమోదు చేసిన అధికారులు, రాజకీయ కారణాల తర్వాత మామూళ్ల మత్తులో మౌనంగా ఉండిపోయారన్న ఆరోపణలున్నాయి. మైనింగ్‌శాఖ నుంచి ఎటువంటి నియంత్రణ లేకపోవడంతో, ఎంత మెటీరియల్ వెళ్తుంది, ఎంత పన్ను కడుతున్నారు అనే నిఘా పూర్తిగా కరువైంది. మైనింగ్‌శాఖ అధికారులు తూతూమంత్రపు తనిఖీలు చేస్తూ క్రషర్ల, టిప్పర్ల యజమానులకు సహకరిస్తున్నారని చుట్టుపక్కల గ్రామాల వారు ఆరోపిస్తున్నారు. అధిక లోడుతో వెళ్తున్న వాహనాలను గుర్తించి చర్యలు చేపట్టాల్సిన రవాణా శాఖ అధికారులు కూడా టిప్పర్ల వారీగా వసూళ్లకు పాల్పడుతూ, నామమాత్రపు జరిమానాలు వేసి చేతులు దులుపుకుంటున్నారని తీవ్ర విమర్శలు ఉన్నాయి. వందలాది టిప్పర్ల వల్ల ఆర్‌అండ్‌బీ రోడ్లు కూడా ధ్వంసమవుతున్నాయి.

బ్యాతోల్ క్వారీ నుంచే బయలుదేరిన టిప్పర్ లోడ్..

చేవెళ్ల పరిధి మీర్జాగూడ సమీపంలో ఆర్టీసీ బస్సును ఢీకొన్న టిప్పర్ లక్డారం సమీపంలో బ్యాతోల్‌లో ఉన్న ఎస్ఎంఎస్ క్వారీలోనే లోడ్ అయింది. ఓవర్ లోడ్‌తో వెళుతున్న టిప్పర్లన్నీ వేకువ జామునే బయలుదేరి, అధికారులు విధులకు రాకముందే తమ గమ్యాలకు చేరుతాయి. మీర్జాగూడ ప్రమాదంతో అధికారులు దాడులు చేస్తారని ముందు జాగ్రత్తతో టిప్పర్, క్రషర్ యజమానులు రవాణాను బంద్ పెట్టడంతో సోమవారం లక్డారంలో ప్రశాంత వాతావరణ నెలకొంది.

లాభం కోసం ప్రాణాలను బలి

టిప్పర్ల యజమానులు తమ లాభం కోసం ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్నారు. ఒక్కో టిప్పర్ సామర్థ్యం 30 టన్నులు ఉండగా, వారు ఏకంగా 60 టన్నుల వరకు కంకర, డస్ట్‌ను ఓవర్‌లోడ్ చేసి తరలిస్తున్నారు. ఈ అధిక లోడు వల్ల టిప్పర్ యజమానులకు రెట్టింపు ఆదాయం సమకూరడంతో పాటు డీజిల్, లేబర్ ఖర్చులు కలిసి వస్తున్నాయి. వేబిల్లు ప్రకారం అనుమతించిన బరువుతో సరఫరా చేస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. రెండు ట్రిప్పుల్లో వెళ్లాల్సిన లోడ్‌ను నిబంధనలను తుంగలో తొక్కి, తమ లాభాలను పెంచుకోవడానికి అధిక లోడుతో వాహనాలను నింపి తరలిస్తున్నారు. ఇదే సమయంలో హడావిడిగా టిప్పర్లను నడిపిస్తూ రోడ్డు ప్రమాదాలకు మూల కారణమవుతున్నారు. అంతేకాకుండా, అధికారుల కంటపడకుండా గమ్యస్థానం చేరుకోవాలనే ఒత్తిడిని యజమానులు టిప్పర్ డ్రైవర్లపై పెడుతున్నారు. దీని కారణంగానే డ్రైవర్లు విపరీతమైన వేగంతో దూసుకుపోతూ తరుచూ ప్రమాదాలకు కారకులవుతున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. టిప్పర్లతో వరుసగా జరుగుతున్న ఈ ఘోర రోడ్డు ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని, వాటిని నివారించేందుకు పోలీసు యంత్రాంగం ప్రత్యేకంగా డ్రైవర్లకు అవగాహన సదస్సులు నిర్వహించాలి అని పలువురు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

మెదక్ జిల్లాలో టిప్పర్ల ప్రమాదాలు

మెదక్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలోని వెల్దుర్తి మండలం ఎల్కపల్లి, బండపోసాన్‌పల్లిలో, మాసాయిపేట మండలం రామాంతపూర్, తూప్రాన్ మండలం ఘనపూర్‌లో మూడు, కొల్చారం మండలం రాంపూర్‌లో కంకర క్వారీలు ఉన్నాయి. వీటి నుంచి రోజూ టిప్పర్లు ఓవర్ లోడ్ చేసుకుని మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్నాయి. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రెండేళ్ల క్రితం దీపావళీ టపాసుల కోసం హోంగార్డ్ భార్య, తన ఇద్దరు చిన్నారులతో స్కూటీపై వెళుతుండగా, మెదక్ కేర్ ఆసుపత్రి ఎదురుగా వెనక నుంచి టిప్పర్ ఢీకొనడంతో వారంతా మృత్యువాత పడ్డారు. గతేడాది మెదక్ రామ్‌దాస్‌చౌరస్తా సిగ్నల్ వద్ద పాదచారిని టిప్పర్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. బాల్‌నగర్ - బోధన్ జాతీయ రహదారి మెదక్ పట్టణం మీదుగా వెళ్తుండడంతో మెదక్ రోడ్ల గుండా భారీ వాహనాలు వందలాదిగా ప్రయాణిస్తున్నాయి. పట్టణానికి బైపాస్ రోడ్డు లేకపోవడంతో ప్రమాదాలూ అధికమయ్యాయి.

పటాన్‌చెరులో ప్రొటోకాల్ రగడ

● ఎమ్మెల్యే వర్సెస్ మంత్రి

పటాన్‌చెరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అన్ని అధికారిక కార్యక్రమాలను స్థానిక ప్రజాప్రతినిధి పర్యవేక్షణలో ప్రొటోకాల్ నిబంధన మేరకు నిర్వహించాలని, లేదంటే అధికారులు హాజరుకాకూడదన్న నిబంధన పటాన్‌చెరులో అమలు కావడం లేదు. స్థానిక ఎమ్మెల్యేకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా మంత్రులతో ప్రారంభోత్సవాలు నిర్వహిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరులోని డబుల్‌బెడ్రూం ఇళ్ల సముదాయంలో రూ.10 కోట్ల వ్యయంతో ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మాణానికి వీఎస్టీ అనే సంస్థ సీఎస్ఆర్ ప్రాజెక్టు కింద ముందుకు వచ్చింది. ఇందుకు సంబంధించి ముందస్తు సమాచారం ఎమ్మెల్యేకు ఇవ్వలేదు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో హౌసింగ్, మున్సిపల్, రెవెన్యూశాఖల అధికారులతో కలిసి నిర్మాణ పనులపై నిత్యం సమావేశాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కలెక్టర్ ప్రావీణ్య, హౌసింగ్ ఎండీ గౌతమ్ కొల్లూరులో పర్యటించారు. సోమవారం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వివేక్, దామోదర్ రాజనర్సింహ వస్తున్నారంటూ అధికారులు ప్రకటించి ఆహ్వానపత్రికలు పంచారు. డీఈవో వెంకటేశ్వర్లు ద్వారా ఎమ్మెల్యేకు సమాచారం అందించారు. దీంతో మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను ఎమ్మెల్యే నిలదీశారు. ఎమ్మెల్యే రాకపోయినా మంత్రులు, కలెక్టర్ కార్యక్రమాన్ని ముగించారు. గతంలోనూ అమీన్‌పూర్ మున్సిపల్ పరిధి కిష్టారెడ్డిపేటలో ఎక్సైజ్ కార్యాలయం శంకుస్థాపనకు మంత్రులు దామోదర్, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావును ఆహ్వానించగా ప్రొటోకాల్‌పై ఎమ్మెల్యే నిలదీయడంతో అప్పటి కలెక్టర్ క్రాంతి కార్యక్రమాన్ని రద్దు చేశారు. సుల్తాన్‌పూర్ డివైజ్ పార్కు, రుద్రారం తోషిబా పరిశ్రమ ప్రారంభం వంటి సందర్భాల్లో సైతం ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేశారు.

సీఎన్‌జీ ఆటో దగ్ధం



కోహీర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు(డి)గ్రామం వద్ద సోమవారం సీఎన్‌జీ ఆటో దగ్ధమైంది. మహారాష్ట్రలోని లాతూర్ నుంచి హైదరాబాద్‌కు ఇద్దరు సీఎన్‌జీ ఆటోలో వెళ్తున్నారు. మండలంలోని కొత్తూరు(డి) గ్రామం వద్ద సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఆటోను రోడ్డు పక్కన ఆపి, టీ తాగుతుండగా, ఆటోలో నుంచి పొగలు వచ్చి, ఆటో మొత్తం కాలిపోయింది. జహీరాబాద్ ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు.

బొగ్గుబట్టీలకు పచ్చని చెట్లు



కుందనవానిపల్లిలో నరికి వేసిన చెట్లు

అక్కన్నపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పచ్చదనానికి ప్రాధాన్యం ఇస్తూ మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తుండగా.. కొందరు వాటిని నరికి బొగ్గుబట్టీలకు.. సామిల్లులకు తరలిస్తున్నారు. మండలంలోని కుందనవానిపల్లి వైకుంఠధామం ఎదురుగా ఉన్న పెద్ద పెద్ద చెట్లను కొందరు సోమవారం నరికి తరలించారు. వాటిని జనగామ, చేర్యాల, మద్దూరు, సిద్దిపేటలోని బొగ్గుల తయారీకి, ఇటుక బట్టీలకు, సామిల్లులకు తరలిస్తున్నారు. పెద్ద పెద్ద వృక్షాలను నరికి తరలించాలంటే అటవీశాఖ అధికారుల అనుమతి తప్పనిసరి. కానీ, మండలంతోపాటు హుస్నాబాద్ డివిజన్ పరిధిలోని హుస్నాబాద్, కోహెడ, బెజ్జంకి, మద్దూర్, దూళిమిట్ట మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో దర్జాగా చెట్లను నరికి అక్రమార్కులు లారీలు, డీసీఎంలు, ట్రాక్టర్లలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అటవీ, రెవెన్యూశాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. ఫిర్యాదులు అందినప్పుడు తూతూమంత్రంగా తనిఖీలు చేసి, తర్వాత మామూళ్లు తీసుకుంటూ అక్రమార్కులకు సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

చెట్లను నరికితే చర్యలు

– మధుసూదన్, తహసీల్దార్, అక్కన్నపేట

అనుమతులు లేకుండా చెట్లను నరికితే చర్యలు తీసుకుంటాం. వనమహోత్సవంలో నాటిన చెట్లను నరికిన జరినామాతో పాటు కేసులు నమోదు చేస్తాం. ఎవరైనా చెట్లను నరికి వేస్తే అట్టి సమాచారాన్ని అందించాలి.

వృద్ధుల కోసం ఏర్పాట్లు చేయలేరా?

● 'ప్రజావాణి'లో సిబ్బంది తీరుపై సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య అసహనం



వినతి పత్రం ఇస్తున్న హంగర్గ.బి రైతులు

సంగారెడ్డి రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి కోసం వచ్చే వృద్ధుల కోసం కనీస ఏర్పాట్లు చేయలేరా అని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య సోమవారం కలెక్టరేట్ సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజావాణికి వచ్చిన వృద్ధులు, దివ్యాంగులు ట్రై సైకిల్ లేక గేటు నుంచి చాంబర్ వరకు వచ్చేందుకు పడుతున్న ఇబ్బందులను చూసిన కలెక్టర్ ఏర్పాట్ల తీరుపై మండిపడ్డారు. కనీసం కనీసం వృద్ధుల కోసం మూడు చక్రాల బండి కూడా ఏర్పాటు చేయలేదని అసంతృప్తికి గురయ్యారు. ఇదిలా ఉండగా ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిశీలించి సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్వో పద్మజారాణి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మా భూములు మాకు ఇప్పించాలి

నారాయణఖేడ్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫ్యాక్టరీ నిర్మించకుండా ఆ భూములను ఇతరులకు విక్రయించేందుకు యత్నిస్తున్నారని, తమ భూములు తమకు ఇప్పించాలని కోరుతూ హంగర్గ.బి గ్రామానికి చెందిన రైతులు సోమవారం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. హంగర.బిలోని 35 మంబది రైతుల నుంచి 160 ఎకరాలను 2006లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు తక్కువ రేటుకు కొనుగోలు చేశారని, కర్మాగారం నిర్మిస్తామని మభ్యపెట్టారన్నారు. ప్రస్తుతం నిర్మించక పోగా, భూములను అమ్ముకోవడానికి యత్నిస్తున్నారని, ఆ భూములను తమకు ఇప్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాణిక్యం, రైతులు బాబుశెట్టి, శ్రీకాంత్, అంజిరెడ్డి, చాంద్‌సాబ్, మారుతి, బీమానాయక్, తదితరులు ఉన్నారు.

సిద్దిపేట ప్రజావాణికి 154 అర్జీలు

సిద్దిపేట నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అర్జీలను త్వరగా పరిష్కరించాలని సిద్దిపేట కలెక్టర్ కే. హైమావతి అధికారులకు సూచించారు. సోమవారం సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి 154 అర్జీలను స్వీకరించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వస్తారని, ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్వో నాగరాజమ్మ, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ భవ్య, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో 77 వినతులు

మెదక్ అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం మెదక్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 77 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు, డీఆర్వో భుజంగరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై నిర్భయంగా ఫిర్యాదు చేయండి

● సంగారెడ్డి ఎస్పీ పంకజ్

సంగారెడ్డి క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యల పరిష్కారం కోసం నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పోలీస్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యలను ఓపికగా విని, పరిష్కారంలో జాప్యానికి గల కారణాలకు సంబంధించి ఎస్‌హెచ్‌వోలతో ఫోన్‌లో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు.

మెదక్ పోలీసు ప్రజావాణికి 13 ఫిర్యాదులు

మెదక్ అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి 13 ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

బైలెల్లుదాం.. బండమీది జాతరకు

● రాముని బండ ఆలయంలో నేటి నుంచి కార్తీక ఉత్సవాలు



విద్యుత్ వెలుగుల్లో ఆలయం

జగదేవ్‌పూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంగంరెడ్డిపల్లి సమీపంలో బండపై వెలిసిన సీతారాములు ఆలయంలో ప్రతీ ఏటా కార్తీక పర్వదినాన్ని పురస్కరించుకుని మూడు రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. బండపై సీతారాములు వెలవడంతో బండమీద జాతరగా పిలుస్తుంటారు. ఈ జాతరకు జగదేవ్‌పూర్, గజ్వేల్, కొండపాక, సిద్దిపేట, ములుగు, చేర్యాల, యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఆలయం ముందు ఉన్న గుండంలో స్నానం చేసి స్వామివారిని దర్శించుకుంటే సర్వరోగాలు నయమవుతాయని భక్తుల నమ్మకం. మంగళవారం నుంచి గురువారం వరకు కొనసాగే జాతరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వహకులు రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కుమార్, అర్చకులు నర్సింహాచార్యులు, జగన్, శ్రీనివాసచార్యులు తెలిపారు. నేడు ఉత్సవాలు ప్రారంభమవుతాయని, మూడు రోజులు ప్రత్యేక పూజలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నిరుపయోగంగా మహతి ఆడిటోరియం

గజ్వేల్ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గత ప్రభుత్వం రూ. 19.47 కోట్లతో నిర్మించిన మహతి ఆడిటోరియం 11 నెలలుగా నిరుపయోగంగా మూతపడింది. ఆడిటోరియం నిర్వహణ బాధ్యతలను అధికారులు విస్మరించడం వల్ల భవనం మసుకబారిపోయిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు పొన్నాల కుమార్ మాదిగ డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి మండిపడ్డారు. గజ్వేల్‌లో సోమవారం పొన్నాల కుమార్, ఏగొండ స్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వం 2019 సంవత్సరంలో 19.47 కోట్ల రూపాయలతో 2 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించబడింది. ఈ మహతి ఆడిటోరియంను లీజ్‌కు ఇవ్వడం ద్వారా ప్రభుత్వానికి ప్రతినెల 1,80,000 రూపాయల అదాయం కుడా వస్తుండేదన్నారు. 11 నెలలుగా ఆడిటోరియం అందుబాటులో లేక పోవడం వలన ప్రభుత్వ ఖాజానికి, ప్రజలకు తీవ్రనష్టం జరుగుతున్నందున వెంటనే ప్రారంభించి ప్రజలకు ఆడిటోరియాన్ని అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు.

పీహెచ్‌డీ స్కాలర్‌కు సన్మానం



పీహెచ్‌డీ సాధించిన మెరాజ్ ఫాతిమాకు బంగారు పతకంతో సత్కారం

సిద్దిపేట కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వృక్షశాస్త్రంలో పీహెచ్‌డీ సాధించిన డాక్టర్ మెరాజ్ ఫాతిమాను మదీనా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో బంగారు పతకంతో సత్కరించారు. తంజీమ్ ఉల్ మసాజిద్ గౌరవ అధ్యక్షుడు అలీమ్ సర్వర్ కుమార్తె డాక్టర్ మెరాజ్ ఫాతిమా వృక్షశాస్త్రంలో తన అత్యుత్తమ డాక్టరల్ పరిశోధనకు గాను మదీనా ఎడ్యుకేషన్ సొసైటీ, హైదరాబాద్ ప్రాయోజకత్వంలో అందించే మదీనా బంగారు పతకంతో డాక్టర్ మెరాజ్ ఫాతిమాను సత్కరించారు. ప్రస్తుతం ఆమె సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 14సంవత్సరాలుగా వృక్షశాస్త్ర విభాగంలో ఫ్యాకల్టీగా సేవలందిస్తున్నారు.

పోస్టల్ బ్యాంకుతో డిగ్రీ కళాశాల ఒప్పందం

హుస్నాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విభాగం, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకింగ్ సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందంలో భాగంగా ఆసక్తి గల విద్యార్థుల్లో ఎంపిక చేసిన వారికి ఇంటర్న్‌షిప్ శిక్షణ ఇస్తారు. దీని ద్వారా విద్యార్థులకు బ్యాంకింగ్ కార్యకలాపాలపై క్షేత్ర స్థాయిలో అవగాహన కలగజేస్తారని కళాశాల ప్రిన్సిపాల్ విజయగిరి బిక్షపతి తెలిపారు. దీంతో బ్యాంకింగ్ సెక్టార్‌లో ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పోస్టల్ బ్యాంకు బ్యాంకు మేనేజర్ కె మధుమోహన్, పోస్టల్ బ్యాంకింగ్ మేనేజర్ రేవతి, పోస్ట్ మాస్టర్ అంజయ్య, కామర్స్ విభాగాధిపతి చంద్రమౌళి తదితరులున్నారు.

ఇంటి పన్ను వసూళ్లపై దృష్టిసారించాలి

● ఎంపీడీవో వీరరాజు

మద్దూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ సెక్రటరీలు వంద శాతం ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని ఎంపీడీవో మీసాల వీరరాజ్ సూచించారు. సోమవారం ధూళిమిట్ట మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామపంచాయతీ పరిధిలో దోమల నివారణకు ఫాగ్గింగ్ చేయాలని ఆదేశించారు. అలాగే పారిశుధ్య పనులు, పైపులైన్ మరమ్మతులు చేపట్టాలన్నారు. మల్టీపర్పస్ వర్కర్లకు ఇన్సూరెన్స్‌పై వివరించారు. అనంతరం పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై అడిగి తెలుసుకున్నారు.

మహిళా జట్టు విజయం.. మొక్కు సమర్పణ



పొట్లపల్లి ఆలయంలో కోడెమొక్కును చెల్లించుకుంటున్న రాజు

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారత మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్ చాంపియన్‌షిప్ సాధించడం పట్ల సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు సోమవారం పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయంలో కోడెమొక్కును చెల్లించారు. కోహెడ మండలం నుంచి జాతీయ జెండాతో పాదయాత్రగా వచ్చిన రాజు ఆలయంలో పూజలు చేశారు. మొదటి సారిగా ప్రపంచకప్ సాధించిన మహిళా క్రికెట్ టీంకు అభినందనలు తెలియజేశారు.

మొంథాకు ధ్వంసమైన రోడ్లు

మద్దూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్‌తో మద్దూరు మండలంలోని పలు గ్రామాల్లోని బీటీ, మట్టి రోడ్లు ధ్వంసమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. కల్వర్టుల వద్ద మట్టి కొట్టుకుపోయి గుంతలు పడ్డాయి. గత వర్షాకాలంలో ఇదే పరిస్థితి నెలకొనగా గుంతలు పడి ధ్వంసమైన కల్వర్టుకు ఆర్ అండ్‌బీ ఆధికారులు రూ. 1,40 లక్షలతో మరమ్మతులు చేపట్టినా మొంథా తుఫాన్‌తో కురిసిన భారీ వర్షానికి గుంతలు పడి ప్రయాణం సాగించలేని పరిస్థితి ఉంది. ధ్వంసమైన రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టకుండా శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ఉప్పరోనిగడ్డ యాదవ సంఘం మండల అధ్యక్షుడు కొమిరె రామస్వామితో పాటు మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



కొట్టుకుపోయిన వల్లంపట్ల నుంచి ఉప్పరోనిగడ్డకు వెళ్లే బీటీ రోడు



వర్షానికి ధ్వంసమైన వల్లంపట్ల నుంచి కూటిగల్‌కు వెళ్లే రోడ్డు,



వర్షానికి ధ్వంసమైన ఉప్పరోనిగడ్డ సోలిపురం మధ్య కల్వర్టు

గుడిసెలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలి

● దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి

తొగుట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దుబ్బాక నియోజకవర్గంలో గుడిసెలు లేని గ్రామాలుగా తీర్చిదిద్ది, అర్హులైన నిరుపేదలందరికీ దశల వారిగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనేత, దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం తొగుట మండలం ఎల్లారెడ్డిపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళు గృహప్రవేశంలో పాల్గొని లబ్ధిదారులు ప్రవళిక-సురేష్ దంపతులకు నూతన వస్త్రాలు అందజేసి ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో పేదలకు ఒక్క ఇళ్లు కూడ నిర్మించి ఇవ్వలేదని మండిపడ్డారు. పేదవాడు ఆత్మగౌరవంతో ఉండేలాగా ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, సబ్సీడీ గ్యాస్, 2 లక్షల రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో గుడిసెలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడం కోసం 3,500 ఇళ్లను దశల వారిగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరీ చేస్తామని తెలిపారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు త్వరిత గతిన నిర్మాణాలు చేపట్టుకొని సొంత ఇంటి కళను సాకారం చేసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఎల్లారెడ్డిపేటలో తన చేతుల మీదుగా ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. తొగుటలో 23 మంది లబ్ధిదారులకు మంజూరైన 9లక్షల 46వేల 500 రూపాయల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక ఆత్మ కమిటి చైర్మన్ గాంధారి నరేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్కం స్వామి, దుబ్బాక నియోజకవర్గ కో ఆర్డీనేటర్ విజయ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రేణుక రవిందర్, మార్కెట్ కమిటి మాజీ వైస్ చైర్మన్ పోచయ్య, మాజీ సర్పంచ్ నర్సింహులు గౌడ్, నాయకులు స్వామి, మహిపాల్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రమేశ్, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొని లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసిన చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

మోడల్ స్కూల్ విద్యార్థులను అభినందించిన కలెక్టర్

దుబ్బాక, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): ప్రయాస్ - 2025కు జాతీయస్థాయిలో ఎంపికైన దుబ్బాక మున్సిపల్ లచ్చపేట మోడల్ స్కూల్ విద్యార్థులను సోమవారం జిల్లా కలెక్టర్ హైమావతి అభినందించారు. అలాగే జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి శాలువను కప్పి సన్మానించారు. సిద్దిపేట కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆదేశం మెరకు విద్యార్థులను ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, ఉపాధ్యాయురాలు జ్యోతిలు తీసుకెళ్లారు. ఈసందర్భంగా విద్యార్థులు ఎండీ అజీజ్, బానోత్ శివ వీరిని మార్గదర్శకం చేసిన ఉపాధ్యాయురాలు గన్నె జ్యోతిని కలెక్టర్ అభినందించారు. అనంతరం జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులను, ఉపాధ్యాయురాలు గన్నె జ్యోతిని శాలువాతో సన్మానించారు.



లచ్చపేట మెడల్ స్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

ఘనంగా తులసీ కల్యాణం

చేర్యాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాస శుద్ధద్వాదశిని పురస్కరించుకుని సోమవారం చేర్యాల పట్టణంలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో తులసీ కల్యాణాన్ని ఘనంగా నిర్వహిం చారు.

పాఠశాల ఆవరణలో మద్యం తాగితే కఠిన చర్యలు

జగదేవ్‌పూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై కృష్ణారెడ్డి హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాలలోని ఆదివారం రాత్రి ప్రభుత్వ పాశాలలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఆకతాయిలు ప్రభుత్వ పాఠశాలల ఆవరణలోమద్యం సేవించి అల్లర్లు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పాఠశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. అలాంటి వ్యక్తులు ఉంటే గ్రామస్తులు 100 నెంబర్‌కు సమాచారం అందించాలని లేదా జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి

గజ్వేల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఆయన నివాసంలో పలువురికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను ఆయన సోమవారం అందజేశారు.

సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం

సిద్దిపేట/చేర్యాల/గజ్వేల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ అధికారులు అన్నారు. సిద్దిపేట జిల్లా విద్యుత్ ఎస్ఈ టీఆర్ చంద్రమోహన్ రైతులుకు నాణ్యమైన విద్యుత్తును అందిస్తున్నామని, లో వోల్టేజీల సమస్యలు ఉన్న చోట వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా గజ్వేల్, చేర్యాల, సిద్దిపేట పట్టణాలల్లో విద్యుత్ భవనాల్లో సమావేశం నిర్వహించారు. డివిజన్ కార్యాలయంతో పాటు డివిజన్ పరిధిలోని వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని గజ్వేల్ విద్యుత్ శాఖ డీఈ ఆర్. భానుప్రకాశ్ అన్నారు. చేర్యాల ఏడీఈ వెంకట్ గౌడ్ మాట్లాడుతూ సాగు, గృహ, వాణిజ్య, పారిశ్రామిక అవసరాల నిమిత్తం నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని, ఎక్కడ సమస్య ఉత్పన్నమైనా వెంటనే పరిష్కరిస్తున్నా మన్నారు.

పాలకుల నిర్లక్ష్యంతో నష్టపోయిన రైతులు

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతోనే భారీ వర్షాలతో రైతులు తీవ్రంగా నష్ట పోయారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశం అన్నారు. తుఫాన్ ప్రభావంతో ఆరు రోజుల క్రితం వరదల్లో పంటల్లో నేలపాలై రైతులు ఆందోళన చెందుతుంటే ప్రభుత్వం స్పందించక పోవడంపై సీపీఐ మండల శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. సోమవారం మండలంలోని గ్రామాల్లో పర్యటించి వరదల వల్ల నష్టపోయిన రైతులను ఓదార్చారు.

'నాడీ' పట్టని వైద్యం

(5వ పేజీ తరువాయి)

ఓ గ్రామంలో విషజ్వరాలు వచ్చిన రోగులందరినీ గజ్వేల్ పట్టణంలోని ఒకే ఆసుపత్రికి సిఫారసు చేయగా, మరో గ్రామానికి చెందిన రోగులు కుకునూరుపల్లిలోని ఓ ప్రైవేట్ క్లీనిక్‌లో వైద్యం పొందారు. వైద్యంపై అవగాహన లేని అమాయక ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకుని రూ.వేలల్లో బిల్లులు వేసి దండుకున్నారు. మరో దారుణం ఏమిటంటే, ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ప్రైవేటు ఆసుపత్రికి సిఫారసు చేయబడిన ఒక రోగికి, ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందించిన డాక్టరే ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందించడం చూసి రోగి ఆశ్చర్యపోవాల్సి వచ్చింది.

కమీషన్ కోసం ఒత్తిడి..

మర్కుక్ మండలంలోని ఓ ఆర్ఎంపీ ఒక ఆసుపత్రికి ఫోన్ చేసి, రోగి ఉన్నాడని, వచ్చే బిల్లులో 50 శాతం కమీషన్ తనకు ఇస్తేనే సిఫారసు చేస్తానని చెప్పాడు. దీనికి తిరస్కరించిన ప్రైవేటు ఆసుపత్రి యజమానిని వదిలి, ఆ రోగిని మరో ఆసుపత్రికి సిఫారసు చేయడంతో, రోగి రూ. 80 వేలు బిల్లు చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రాణం ఖరీదు రూ.లక్ష నుంచి మొదలు

గజ్వేల్‌లోని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇటీవల మృతుల సంఖ్య పెరుగుతోంది. ఈ మృతుల వివరాలు బయటకు పొక్కకుండా ఆసుపత్రి యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. పలువురు రాజకీయ నాయకులు, మీడియా అని చెప్పుకునే కొందరు నకిలీలతో రాత్రికి రాత్రే సెటిల్‌మెంట్లు చేస్తూ ప్రాణాలకు విల(ువ కడుతున్నారు. ఒక్కో ప్రాణం ఖరీదు రూ. లక్ష నుంచి మొదలుకుని రూ.10లక్షల వరకు ఉంటుంది. ఇలా ప్రాణాలకు విలువ కడుతున్నా కూడా అధికారులు స్పందించడం లేదు. తమకు 'ఫిర్యాదు రాలేదు' అనే సింగిల్ వర్డ్‌తో విషయాన్ని క్లోజ్ చేస్తున్నారు. రూ.లక్షల్లో కిరాయిలు, రూ.లక్షల్లో పరికరాలు పెట్టి వచ్చిరాని వైద్యంతో మరికొందరు నకిలీ ఆర్ఎంపీలు గ్రామాల్లో వైద్యాన్ని అందిస్తున్నా కూడా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నా యి. ఆసుపత్రులకు నిబంధనలు వర్తిస్తాయని చెబుతున్న అధికారులు, ప్రథమ చికిత్స కేంద్రాల్లో మందులు, వివిధ రకాల స్కానింగ్ యం త్రాలు, ఇతర సామగ్రి ఉన్నా చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కఠినచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



ధర్నా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథక కార్మికులు

సిద్దిపేట అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల తొమ్మిది నెలల పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి అన్నారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజన కార్మికులతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారం రోజులలో ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే నిరవధికంగా బందు పెట్టి నిరసన తెలుపుతామని అన్నారు. 9 నెలలుగా జీతాలు రాకపోవడం బిల్లులు రాకపోవడం వలన కార్మికులు అప్పులు తీసుకొచ్చి వంట చేసి పెట్టాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వం స్పందించి బిల్లులు విడుదల చేసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పార్ట్‌టైం ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకోవాలి

● కలెక్టర్‌కు పేరెంట్స్ కమిటి వినతి

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గురుకుల బాలుర పాఠశాలలో సస్పెండ్ చేసిన 6గురు పార్ట్‌టైం ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకోవాలని గురుకుల పాఠశాల పేరెంట్స్ అసోసియేషన్ సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. జిల్లెలగడ్డ సాంఘీక సంక్షేమశాఖ విద్యార్థి మృతి సంఘటనకు కారకులైన దోషులను గుర్తించకుండానే ఎలాంటి సంబంధ ం లేని 6గురు పార్ట్‌టైం ఉపాధ్యాయులను తొలగించడం సరికాదని, వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని గురుకుల పాఠశాల పేరెంట్స్ అసోసియేషన్ సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

కేజీబీవీ పాఠశాలని సందర్శించిన మండల విద్యాధికారి

మర్కుక్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండల పరిధిలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని మండల విద్యాధికారి వెంకటరాములు, పంచాయతీ రాజ్ ఏఈ రాజేష్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ఎస్‌వో భాగ్యలక్ష్మితో పాటు విద్యార్థుల మధ్యాహ్న భోజనం, పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలిచారు.

ప్రారంభంకాని ధాన్యం కొనుగోళ్లు

దౌల్తాబాద్/కోహెడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగసముద్రాల ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రారంభం కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత నెల 9న ఐకేపీ కేంద్రం ప్రారంభించినప్పటికీ కుంటి సాకులు చెప్పి వరితాలు పట్టే యంత్రాలు అందుబాటులో ఉంచకపోవడం కారణంగా రైతులు ఆరబెట్టిన ధాన్యం వర్షాలకు మళ్లీ తడిసాయి. 15 రోజులుగా ధాన్యం తాలు పట్టేందుకు రైతులు మిషన్ల కోసం ఎదురుచూస్తూ ఆందోళన చేస్తున్నారు. రెండు రోజుల క్రితం సెంటర్ నిర్వాహకులను, సీసీని ఇదే విషయమై నిలదీశారు. అయినా ఫలితం లేకపోయింది. మరమ్మతుల గురైన యంత్రాలను తీసుకొచ్చి కేంద్రానికి అప్పగించారు. ఆ యంత్రాలతో ధాన్యం పట్టలేక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెల రోజులు అవుతున్న ధాన్యాన్ని తూకం వేయకుండా అలసత్వం చేయడం తగదని దౌల్తాబాద్ బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు దేవుడి లావణ్య నరసింహారెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు అమ్ముకోవడానికి రైతన్నలు ఆందోళన చెందుతున్నారన్నారు.

శాఖాహార, మాంసాహార మార్కెట్ భవన పనులు పూర్తి చేయాలి

● బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లిఖార్జున్‌రెడ్డి

హుస్నాబాద్ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలో పెండింగ్‌లో ఉన్న సమీకృత శాఖాహార, మాంసాహార మార్కెట్ భవనాన్ని వెంటనే పూర్తి చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన హుస్నాబాద్ పట్టణంలో అర్ధంతరంగా నిలిచిపోయిన సమీకృత శాఖహార, మాంసహార భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ భవన నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేశారన్నారు. కాని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడచినా దీనిని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకరాకుండా నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలన్నారు.

పంట నష్ట వివరాల సేకరణ

నంగునూరు/కోహెడ/హుస్నాబాద్‌రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతుల వివరాలను రెండు రోజుల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్రమైన నివేదిక తయారు చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి జె స్వరూపరాణి వ్యవసాయ విస్తరణ అధికారులను ఆదేశించారు. సోమవారం హుస్నాబాద్ మండలంలోని పందిల్ల గ్రామంలో దెబ్బతిని నష్టపోయిన రైతులతో మట్లాడి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా. తమ ఆరుగాలం శ్రమంతా వరదపాలైందని రైతులు ఆవేదన చెందారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పంట నష్ట వివరాల అంచనాలు తయారు చేస్తున్నట్లు డీఏవో తెలిపారు. మొంథ తుఫాను లో నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి అన్నారు. అకాల వర్షాలకు నష్టపోయిన వరి పొలాలను సోమవారం కార్యకర్తల తో కలిసి సందర్శించి మాట్లాడారు. సంబంధిత అధికారులు పంట నష్ట పోయిన ప్రతి గుంటను లెక్కకట్టి ప్రభుత్వము నుంచి పరిహారం అందేవిదంగా చర్యలు చేపడతామని చెప్పారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 30 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం/గజ్వేల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 30 మందికి జరిమానా విధించారు. గజ్వేల్ పట్టణంలోని పలు చౌరస్తాల్లో ఇటీవల తనిఖీలు నిర్వహించారు. తనిఖీలో తొమ్మిది మంది పట్టుబడ్డారు. తొమ్మిది మందికి రూ.10వేల చొప్పున రూ.90వేలు జరిమానా విధించారు. గజ్వేల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మూల స్వాతిగౌడ్ తీర్పును వెలువరించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ సీఐ ఎం.మురళీ తెలిపారు.

సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాలలో రాజీవ్ రహదారిపై 21 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ పట్టుకున్నారు. వారిని సోమవారం అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కుమారి వి. తరణి ముందు హాజరు పరచగా విచారణ చేసి 20 మందికి రూ .2,12500/- జరిమానా ఒక వ్యక్తికి 1 రోజు జైలు శిక్ష విధించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కరాటే తరగతులు

సిద్దిపేట కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలోని 27 ప్రభుత్వ పాఠశాలల్లో కరాటే శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సిద్దిపేట జిల్లా క్రీడలు, యుజన శాఖ అధికారి జంగపల్లి వెంకట నరసయ్య తెలిపారు. రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్షణ, ప్రశిక్షణ బాలికలకు ఆత్మరక్షణలో భాగంగా కరాటే శిక్షణనిచ్చే ఔత్సాహిక శిక్షకులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 5న సాయంత్రం 3గంటల వరకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు సంబంధిత శాఖ అధికారి సెల్ నెంబర్ 9441925763ను సంప్రదించవచ్చాన్నారు.

గదరాజు జోషికి డాక్టరేట్



గదరాజు జోషిని అభినందిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా

చేర్యాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం కడవేరుగు గ్రామానికి చెందిన గదరాజు జోషి డాక్టరేట్ అందుకున్నాడు. ఉస్మానియా యూనివర్సిటీలో జెనెటిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొ ఫెసర్ విజయ్‌కుమార్ పర్యవేక్షణలో అసెస్‌మెంట్ ఆఫ్ బ్లాక్ గ్రామ్ జినోటైప్స్ ఫర్ ఎల్డ్ అండ్ ఎల్డ్ కాంట్రిబ్యూటింగ్ ట్రైట్స్ అండర్ డ్రాడ్ స్ట్రెస్ కండీషన్ అంశంపై పరిశోధనలు జరిపి ఫలితాలు రాబట్టి నివేదిక అందించారు. దీంతో యూనివర్సిటీ అధికారులు డాక్టరేట్ ప్రధానం చేశారు. అనంతరం వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహా రాజును కలిసి అభినందించారు.

మలకంబ్ పోటీలకు నారాయణరావుపేట విద్యారులు

సిద్దిపేట రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 4, 5, 6న భువనగిరి జిల్లా చౌటుప్పల్ లో జరిగే మలకంబ్ రాష్ట్ర స్థాయి పోటీలకు నారాయణరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలలో విద్యార్థులను సోమవారం ఉపాధ్యాయు బృందం అభినందించారు. అండర్-14 బాలురలో సాత్విక్, రామ్ చరణ్,ఎం.చరణ్, బాలికలు సింధు, అశ్వి త,లిఖిత,రవిత్రేయ, తపస్య అండర్-17 బాలికలు మధు ప్రియ, రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

బస్సు సర్వీస్ ప్రారంభం

కొమురవెల్లి,నవంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని అయినపూర్ గ్రామం నుంచి కొమురవెల్లి మీదుగా చేర్యాల, బచ్చన్నపేట నుంచి జనగామ జిల్లా వరకు సోమవారం నూతన ఆర్టీసీ బస్సు సర్వీసను జనగామ ఆర్టీసీ డిపో అధికారులు ప్రారంభించారు. అయినపూర్ గ్రామానికి బస్సు రావడంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు,గ్రామస్థులు కొబ్బరికాయ కొట్టి బస్సు సర్వీస్‌ను ప్రారంభించారు.ఈ బస్సు ప్రతిరోజు ఉదయం 8.40 గంటలకు గ్రామం నుంచి బయలు దేరుతుందని తెలిపారు.

ఉద్యోగ విరమణ

సిద్దిపేట కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని నూతన ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్ ఉద్యోగ విరమణ అభినందన సభ ఏర్పాటు చేశారు. సోమవారం పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు జి. తిరుపతిరెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి ఈ. శ్రీనివాస్ రెడ్డి హజరయ్యారు.

కార్తీక దీపారాధన



సిద్దిపేట శ్రీ ఉమాపార్థివ కోటిలింగేశ్వరాలయంలో మహిళ దీపారాధన

సిద్దిపేట కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా జిల్లాలోని పలు ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోతున్నాయి. కార్తీక సోమవారం సందర్భంగా పలు శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీ ఉమాపార్థివ కోటిలింగేశ్వరాలయంలో స్వామివారికి పల్లకి సేవ నిర్వహించారు. సాయంత్రం ఆకాశ దీపం కార్యక్రమం నిర్వహించారు.